క్లుప్తంగా

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన ఎఫ్‌ఏలు

హన్వాడ: మండలంలోని వివిధ గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్‌లు శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీఆర్‌డీఓ యాదయ్య అడిషనల్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు తీసుకున్న సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, అంజిలయ్య, వెంకటనాయక్, వెంకటేష్, లక్ష్మీనారాయణ, యాదయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ ఎరువులు వినియోగించుకోవాలి

మహమ్మదాబాద్: రైతుల సభ్యత్వం ద్వారా నాబార్డు సంస్థతో తీసుకుంటున్న రాయితీ ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృపాకర్‌రెడ్డి తెలిపారు. గాధిర్యాల్‌లో నాబార్డు ఆధ్వర్యంలో శుక్రవారం ఎరువుల పంపిణీ దుకాణం ప్రారంభించారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

డివిజన్ మార్పుతో ఉమ్మడి మండలానికి లబ్ధి

గండీడ్: పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి కృషితోనే నారాయణపేట్ లో ఉన్న విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయాన్ని మహబూబ్‌నగర్‌కు మార్చారని గండీడ్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాధవి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు మార్చడం ఉమ్మడి మండల ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

కిషన్‌రెడ్డి ర్యాలీకి భారీగా జనసమీకరణ

పాలమూరు: కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఈనెల 31న మహబూబ్‌నగర్‌కు వస్తున్న నేపథ్యంలో ర్యాలీకి భారీగా జనసమీకరణ చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడకుల బాలరాజు అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం పాలమూరు నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. సత్యం, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ రూరల్: గ్రామ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, నాయకులు మాణిక్యరాజు, ఆదివిష్ణు, సురేష్ పాల్గొన్నారు. **దేవరకద్ర:** మండలంలో శుక్రవారం కొనసాగిన సమ్మెలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, మండల నాయకులు వెంకట్రాములు, ఆశన్న బుగ్గన్న, అంజనేయులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో పింఛన్లు

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో పింఛన్లు మంజూరు కాని 13 మందికి జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి తన సొంత డబ్బులతో పింఛన్లను అందజేయించారు. ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున స్థానిక నాయకులు శుక్రవారం రాత్రి పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీకాంత్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అదేవిధంగా బలీదుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరికీ పింఛన్లను పంపిణీ చేయించారు. శ్రీధర్ యాదవ్, నర్సింహ్మ, సత్యనారాయణ, రాజుసాగర్, మనోజ్‌కుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

వాసవీమాతకు పూజలు




దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అధిక శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవ, లలితా సహస్ర పారాయణం చేపట్టారు.

స్కూల్ స్వీపర్లకు న్యాయం చేయాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : స్కూల్ స్వీపర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న డిమాండ్‌చేశారు. ఈ మేరకు శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు చంద్రాయుడు, కార్యదర్శి బాలనాగయ్య, రాములు, బాలరాజు పాల్గొన్నారు.

39 క్రీడాప్రాంగణాలకు స్పోర్ట్స్ కిట్లు



కోయిల్‌కొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో 39 క్రీడా ప్రాంగణాలు పూర్తయ్యాయని, వాటికి స్పోర్ట్స్ కిట్లు వచ్చాయని ఎంపీడీఓ జయరాములు శుక్రవారం తెలిపారు. త్వరలోనే పంపిణీ చేస్తామని వివరించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి ఉన్నారు.

ఓటింగ్ ప్రక్రియపై అవగాహన



ఈవీఎం యంత్రాలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ పార్థసారథి

- మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్ కార్యాలయంలో కేంద్రం ఏర్పాటు

మహబూబ్‌నగర్ రూరల్: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల సంఘం ప్రక్రియను వేగవంతం చేసింది. నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులను నియమించింది. ఈ క్రమంలో ఓటుహక్కు వినియోగం, అపోహలను తొలగిస్తూ ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పనితీరుపై క్షేత్రస్థాయిలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభించింది. శుక్రవారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. నియోజకవర్గానికి రెండు సంచార వాహనాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. పేరు, సెల్ నంబర్ నమోదు చేసుకొని నమూనా ఓటు వినియోగం, వీవీ ప్యాట్‌లో వచ్చే స్లిప్, బీప్ శబ్దం తదితర ప్రక్రియలను వివరిస్తున్నారు. అదే సమయంలో కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పేరు, చిరునామా మార్పు, మరణించిన, వలస వెళ్లిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. ఓటర్ల జాబితాల సవరణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బూత్ స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమాలు సాగుతున్నాయి.

అపోహలను తొలగిస్తూ...

ఈవీఎం యంత్రంలో ఓటు వేస్తే మరొకరికి వెళ్తుందన్నది ఓటర్లకు ఉన్న పెద్ద అపోహ. వాటిని తొలగిస్తూ ఈసారి ఎన్నికల సంఘం క్షేత్రస్థాయిలో పర్యటించి, అవగాహన కార్యక్రమాలు కల్పించాలని అధికారులను ఆదేశించింది. ప్రత్యేక బృందాల ద్వారా రెండు నెలల పాటు అవగాహన ప్రక్రియ సాగనుంది. బ్యాలెట్ యూనిట్‌లో కంట్రోల్ యూనిట్, ఈవీఎం, వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైడ్ పేపరు ఆడిట్ ట్రయల్) పనితీరుపై నియోజకవర్గ వ్యాప్తంగా 272 పోలింగ్ కేంద్రాల్లో వివరించనున్నారు. గుర్తుల స్థానంలో ఏబీసీడీలను ఏర్పాటు చేసి ఓటును వేయిస్తున్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటింగ్ యంత్రాల ప్రదర్శన కేంద్రాన్ని తహసీల్దార్ బి.పార్థసారథి సందర్శించి ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమయంలో కార్యాలయానికి వచ్చిన ప్రజలు సైతం కేంద్రంలో నమూనా ఓటును వినియోగించుకున్నారు.

అవగాహన కల్పించేందుకు..

ఈవీఎం, వీవీ ప్యాట్ పనితీరుపై కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చాం. ఓటింగ్ యంత్రాలపై వయోజనులు అవగాహన పెంచుకోవాలి. సంచార వాహనాల ద్వారా ప్రత్యేక బృందాలు అవగాహన కల్పిస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన పెంచుకుని ఎవరి ప్రమేయం లేకుండా ఓటు వేయాలి.

– బి.పార్థసారథి, తహసీల్దార్, మహబూబ్‌నగర్ అర్బన్

శాశ్వత పరిష్కారం లేనట్టేనా?



రాజాపూర్ శివారులో మల్లేపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జిలో నిలిచిన వర్షపునీరు

- రాజాపూర్ అండర్‌బ్రిడ్జిలో నిలిచిన వర్షపునీరు
- ఇబ్బందులు పడుతున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు

రాజాపూర్: వర్షం వచ్చిందంటేచాలు అండర్ బ్రిడ్జిలో వర్షపునీరు నిండి ఆ చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. రెండు మూడు రోజులుగా కురుస్తున్న ముసురువర్షానికి గురువారం రైల్వే అండర్‌బ్రిడ్జిలో వర్షపునీరు నిలవడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. రైల్వే డబుల్ లైన్ నిర్మాణం కావడంతో ఇక నుంచి తమ గ్రామాలకు అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లొచ్చని అనుకుంటున్న తరుణంలో ఇబ్బందులు తమను అవస్థలకు గురిచేస్తున్నాయని ప్రజలు అంటున్నారు. మండల కేంద్రం నుంచి మల్లేపల్లి, ఈద్గాన్‌పల్లి, సోమ్లాతండా, ప్రేమ్లీతండాలతోపాటు, జడ్చర్ల మండలం కోడ్గల్, లింగంపేట్ తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. వర్షం వచ్చిందంటే బ్రిడ్జి వద్ద నీరు నిలిచి అంతరాయం కలుగుతోందని, 15 కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సి దుస్థితి తలెత్తుతోందని అంటున్నారు. గత సంవత్సరం వర్షాకాలంలో ఇదే సమస్య ఉండటంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టగా రైల్వేశాఖ అధికారులు నీరు నిలవకుండా సమీపంలో ఒక బోరుమోటరు ఏర్పాటు చేసి తోడివేశారు. కానీ కొన్ని రోజుల తరువాత అది చోరీకి గురికావడంతో సమస్య మొదటికి వచ్చింది. కాగా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైల్వేలైన్ కట్ట కింది పక్క నుంచి కాల్వ తీసి పక్కనే ఉన్న దుందుభీ వాగులో కలపాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం వచ్చిదంటే గోస

వర్షం వచ్చిందంటే ఈ బ్రిడ్జిలోనీళ్లు నిలిచి గోసపడాల్సి వస్తోంది. పనుల కోసం రాజాపూర్‌కు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి

– సత్యయ్య, రైతు, మల్లేపల్లి

ఆస్పత్రికి వెళ్లాలన్నా తిప్పలే..

బ్రిడ్జి వద్ద నిండా నీరు నిలవడంతో ఇబ్బందులు పడుతున్నాం. జ్వరం వచ్చినా ఆస్పత్రికి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఏదైనా పెద్ద ఆపద వస్తే అంబులెన్స్ కూడా తండాకు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

– హన్మి, సోమ్లానాయక్ తండా

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో ప్రైవేటు స్కూల్స్ ఆధ్వర్యంలో 10, 9 జీపీఏ పాయింట్లు సాధించిన 600 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను శుక్రవారం అందించారు. కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై ప్రసంగించారు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు సైతం విద్యాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయని, ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని అన్నారు. ప్రైవేటు పాఠశాలల సంఘం భవన నిర్మాణానికి భూమి, నిధులు కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, ట్రాస్మా అధ్యక్షుడు ప్రభాకర్, రాంచందర్‌జీ, భానుప్రతాప్, మల్లికార్జున్, సురేందర్, అంబాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవనానికి స్థలం కేటాయింపు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో దేవాంగ కుల ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయింపు పత్రాలను సంఘం నాయకులకు అందజేశారు. భవన నిర్మాణానికి ఆర్థికసాయం చేస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీహరిఅమృత్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి జనార్దన్, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, సంయుక్తకార్యదర్శి భాస్కర్, సభ్యులు పాల్గొన్నారు.

పీర్లకు దట్టి సమర్పణ

పాతపాలమూర్ మసీదులో ఏర్పాటు చేసిన హిమాం, హుసేన్ పీర్లకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ పూజలు చేసి దట్టి సమర్పించారు. అనంతరం అలాయి ఆడారు.

ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి

జడ్చర్ల టౌన్: విద్యాసంస్థల్లోకి ఎవరిని రానివ్వరాదని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాలు ఇవ్వటం సిగ్గుచేటని, వెంటనే వెనక్కి తీసుకోవాలని స్టూడెంట్ రైట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దరాజు శుక్రవారం డిమాండ్ చేశారు. వైఫల్యాలు బయటకు రాకూడదనే ఉద్దేశ్యంతో అలాంటి ఆదేశాలు ఇచ్చారని ఆరోపించారు. ఇటీవల గద్వాల బీసీ హాస్టల్ పైకప్పు కూలిపోయిందని, బాలానగర్‌లో గురుకుల పాఠశాలలో పైకప్పు నుంచి నీరు కారుతున్నందున విద్యార్థులకు 4రోజులు సెలవులు ఇచ్చారన్నారు. ఇలాంటి సమస్యలు వెలుగులోకి రాకూడదనే ఆదేశాలు ఇచ్చారని అన్నారు.

పోరాటానికి సిద్ధంకండి

రాజాపూర్: ఎస్సీవర్గీకరణ ఆశయసాధన కోసం చేస్తున్న అంతిమ పోరాటానికి మాదిగ సమాజం సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు బీజేపీ వర్గీకరణపై కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఆగస్టులో హైదరాబాద్‌లో విశ్వరూప సభ ఉంటుందని వివరించారు. ఎంఎస్పీ ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య, జిల్లా అధ్యక్షుడు వినోద్‌మాదిగ, మీసాల గణేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

జడ్చర్ల టౌన్: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలో కూలిపోయిన ఇళ్లను గురువారం కాంగ్రెస్, బీజేపీ నాయకులు వేరువేరుగా సందర్శించారు. నల్లకుంటలో పర్యటించి మాజీ ఎమ్మెల్యే యం.చంద్రశేఖర్ బాధితులను పరామర్శించారు. వారికి డబుల్‌బెడ్‌రూం కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి సందర్శించి బాధితులను పరామర్శించారు. వెంటనే వారికి ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేపడ్తామని హెచ్చరించారు. ఆయన వెంట కౌన్సిలర్ కుమ్మరిరాజు, నాయకులు ఉన్నారు.

కొనసాగిన జీపుయాత్ర


జడ్చర్ల టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసమే జీపుయాత్ర చేపట్టినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ స్పష్టం చేశారు. ఈనెల 26న చేపట్టిన యాత్ర శుక్రవారం జడ్చర్లకు చేరుకుంది. స్థానిక నాయకులు స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం స్థానికంగా ఉన్న హాస్టళ్లను పరిశీలించారు. మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచటం లేదని, జిల్లాలో హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. యాత్ర అనంతరం సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కురుమూర్తి, భరత్, మణికంఠ, రాధిక, మమత పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం




కోయిల్‌కొండ: కొత్లాబాద్ సీతరామాంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి భారతమ్మ రాములుగౌడ్ జ్ఞాపకార్థం కృష్ణయ్యగౌడ్, మల్లికార్జున్‌గౌడ్‌లు రూ.లక్షా నూట పదహారు, అదేవిధంగా కాశీపతిచారి రూ. లక్షా పదహారు, బాలవర్ధన్‌రెడ్డి రూ.50వేలు, టంకరి రవిగౌడ్ రూ.50వేలు, ఆనంద్‌గౌడ్ రూ.50వేలు విరాళంగా శుక్రవారం అందించారు. నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మండలి పూజ



మిడ్జిల్: మండలకేంద్రంలో శుక్రవారం లక్ష్మీనర్సింహస్వామి మండలిపూజ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం వద్ద హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు పూజారి సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్వచ్ఛభారత్‌పై ప్రతిజ్ఞ



మిడ్జిల్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి ఇంటి ఆవరణలో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ప్రతిజ్ఞ నిర్వహించారు. సర్పంచ్ రాధిక, కార్యదర్శి సాయన్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



మహబూబ్‌నగర్ క్రైం: బి.నగేష్ మహబూబ్‌నగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గద్వాల నుంచి బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్పీ కె.నరసింహను మర్యాదపూర్వకంగా కలిశారు.

మొక్కల పంపిణీ

నవాబుపేట: ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని మండల అభివృద్ధి శ్రీలత సూచించారు. మల్కాపూర్‌లో శుక్రవారం మొక్కల పంపిణీ చేపట్టారు. అనంతరం పారిశుద్ధ్యంపై ఆరాతీశారు. ఏపీఓ జ్యోతీ, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

బాధితులకు పునరావాసం

బాలానగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో బాలానగర్ మండల కేంద్రంలో జైనా బేగం, చిన్నరేవల్లి గ్రామం పోచమ్మగడ్డతండాలో హనుమంతు నాయక్ ఇళ్లు కూలిపోయాయి. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించి పునరావాసం కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొంగిపొర్లుతున్న వాగులు దాటరాదని సూచించారు.

ఇంటింటి సర్వే



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 16వ వార్డులో పరిధిలోని బోయపల్లిలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోతిలాల్, మాజీ కౌన్సిలర్ కావలి శరత్ చంద్ర, బీఆర్ఎస్ నాయకులు పిట్ల ఆంజనేయులు, పత్తి వెంకట్రాములు, జాజిమొగ్గ నర్సింహులు, కావలి యాదయ్య, బైని రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నవాబుపేట: మైసమ్మ ఆలయ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ పురుషోత్తం కథనం ప్రకారం శుక్రవారం కారూర్‌కి చెందిన లలిత, ఆమె భర్త నర్సింహులు, కుమార్తె జాహ్నవి ద్విచక్ర వాహనంపై జిల్లా కేంద్రం నుంచి కారూర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో మైసమ్మ నర్సరీ వద్ద నవాబుపేట నుంచి వస్తున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. ఘటనలో నర్సింహులు, జాహ్నవి తీవ్రంగా గాయపడగా హైదరాబాద్‌కు తరలించారు. లలితకు పాక్షికంగా గాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిరాశ్రయులను ఆదుకోవాలి

జడ్చర్ల టౌన్: వర్షాలతో నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి జగన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు వినతిపత్రం సమర్పించారు. 12రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని 5వవార్డు నాగసాలలో ఇళ్లు కూలి కొందరు నిరాశ్రయులయ్యారని అన్నారు. వారికి రూ.లక్ష పరిహారంతో పాటు, పునరావాసం కల్పించాలని కోరారు. సత్తయ్య, సాయిలు, పరశురాం ఉన్నారు.

'డబుల్' ఇళ్లకు లక్కీ డిప్

నవాబుపేట: రుద్రారంలో నిర్మించిన 24 డబుల్ బెడ్రూం ఇళ్లకు శుక్రవారం తహసీల్దార్ రాజేందర్ రెడ్డి సమక్షంలో లక్కీ డిప్ తీశారు. వారిలో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, దివ్యాంగులకు ప్రత్యేక కోటాలో ఇళ్లు కేటాయించారు. సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ లలితమ్మ, తాహేర్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



గండేడ్: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి శ్వేతా రెడ్డి అన్నారు. గొల్లగడ్డ, కప్లాపూర్ గ్రామాల్లో శుక్రవారం వైద్య అధికారులు పర్యటించారు. పరిసరాల శుభ్రతపై ఆరా తీశారు. గ్రామాల్లో నిల్వనీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. గండీడ్ పీహెచ్‌సీ పరిధిలోని ఆశ కార్యకర్తలు ప్రతిఒక్కరు ప్రతిరోజు 30 ఇళ్లలో ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఉచిత వైద్య శిబిరాలను పరిశీలించారు. సోమవారం వరకు కొనసాగించాలని మెడికల్ ఆఫీసర్‌కు చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

మొహర్రం వేడుకలపై సమావేశం

మిడ్జిల్: మండలంలో మొహర్రం వేడుకలను శాంతియుతంగా నిర్వహించాలని ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటుగా, బోయిన్‌పల్లి, వాడ్యాల్ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులకు, గ్రామ యువతకు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వేడుకలలో ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని, కావాలని ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసుల పహారా ఉంటుదని సూచించారు. ఎంపీపీ సుదర్శన్, ఎంపీటీసీ గౌస్, గ్రామ పెద్దలు వెంకట్‌రెడ్డి, శ్రీనువాసులు, వెంకటేష్‌గౌడ్, రాజేశ్వర్, తిరుపతి, గోపాల్, ఉస్మాన్, దస్తగిరి, బంగారు, తదితరులు పాల్గొన్నారు.

మోతీనగర్‌కు దారి బంద్



అండర్ పాస్ దాటే క్రమంలో నీటిలో పడిన వ్యక్తి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో వానలకు పలు కాలనీల్లో నీళ్లు చేరాయి. మోతీనగర్‌కి దారి పూర్తిగా బంద్ అయింది. రైల్వే స్టేషన్ నుంచి మోతినగర్‌కు వెళ్లేందుకు గాండ్లోని చెరువు అండర్ పాస్ ఏకైక మార్గం ఉంది. ఇక్కడ నడుము లోతు వరకు వరద నీళ్లు చేరాయి. దీంతో పలు ప్రాంతాలకు రాకపోకలు లేకుండా పోయాయి. పలువురు తప్పనిసరి దాటుతూ ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి నీరు తొలగిపోయేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సబ్సిడీ గొర్రెల పంచాయితీ

హన్వాడ: వేపూర్‌లో శుక్రవారం రాత్రి గొర్రెల పంచాయతీ చోటుచేసుకుంది. అధికారులు తమకు అనుకూలమైన వారికే పంపిణీ చేయడంపై మిగతా వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మొత్తం 100 మంది సభ్యత్వంతో యాదవ సంఘం ఉండగా మొదటివిడతలో సగంమందికి పంపిణీ చేశారు. మిగతా 50మందితో రెండో విడత కోసం రూ.43,700 చొప్పున మొత్తం రూ. 21.85లక్షల డీడీలు కట్టించుకున్నారు. కేవలం 6గురికి శుక్రవారం పంపిణీ చేశారు. కాగా అనుకూలమైన వారికి ఇచ్చేందుకు ముందుగా అనుకున్న ప్రకారం అధికార పార్టీకి చెందిన ఇద్దరికి సమాచారం ఇచ్చారని, వారితో పాటు మరో నలుగురికి అందజేశారని మిగతావారు ఆరోపించారు. కొందరు సంఘం పెద్దలు అధికారులతో కుమ్మక్కై మిగతా వారికి అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఉమ్మడిగా ఏర్పడిన యాదవ సంఘంలో అధికారులు కుల చిచ్చు రేపారని స్థానిక పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా సబ్సిడీ గొర్రెలను అనంతపురం నుంచి తీసుకొస్తున్న క్రమంలో మైబు, కేశవులుకు చెందిన రెండు గొర్రెలు తొక్కిసలాటలో మృత్యువాత పడ్డాయి. ఈ మేరకు స్థానిక పశువైద్యాధికారులు వాటికి పంచనామా నిర్వహించి బీమా కోసం సిఫార్సులు చేశారు.

గొర్రెల అమ్మకంపై విచారణ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రానికి చెందిన సబ్సిడీ గొర్రెలను కాపరులు విక్రయించారన్న దానిపై శుక్రవారం మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ విచారణ చేపట్టారు. తుంకినీపూర్ రోడ్డు పక్కన గుట్ట వద్ద కాపరుల గొర్రెలను పరిశీలించారు. 6 మందిలోఒక్కరు మినహా మిగిలిన వారందరు గొర్రెలను అమ్ముకున్నారన్న ఆరోపణలపై విచారణ చేశారు. కొందరు తమకు పంపిణీ చేసిన గొర్రెలను మేత కోసం ఇతర మండలాలకు పంపించినట్లు చెప్పారని తెలిపారు. శనివారం కూడా విచారణ చేసి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తానని చెప్పారు.

కేజీవీల్స్‌తో రోడ్ల పైకి రావొద్దు

అడ్డాకుల: ట్రాక్టర్లకు కేజీ వీల్స్ వేసుకుని బీటీరోడ్ల పైకి ట్రాక్టర్లు వస్తే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అడ్డాకుల ఎస్ఐ మాధవరెడ్డి హెచ్చరించారు. గ్రామాల్లో శుక్రవారం పర్యటించి డ్రైవర్లతో మాట్లాడారు. కరిగెట్లు చేసిన తర్వాత ట్రాక్టర్లకు అక్కడే కేజీ వీల్స్‌ను తొలగించి టైర్లను బిగించిన తర్వాత బీటీరోడ్లపైకి రావాలని సూచించారు. మండలంలోని సర్పంచులు తమ గ్రామాల్లో దీనిపై దప్పుతో ప్రచారం చేయించాలని విజ్ఞప్తి చేశారు.

నిధుల విడుదలపై వినతి

పాలమూరు: బీఆర్ఎస్ ప్రభుత్వంపై కుట్రతో కేంద్రం ప్రభుత్వం ఎన్‌సీడీసీ నిధులు నిలిపివేసిందని, ఈ అంశాన్ని పార్లమెంట్‌లో చర్చించాలని కోరుతూ జిల్లా గొర్రెల సంఘం ఛైర్మన్ శాంతయ్య యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. గోపాల్, రమేష్ నర్సింహులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డికి ఘననివాళి



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎస్.జైపాల్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిబాబా పాల్గొన్నారు. **మిడ్జిల్:** కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డికి శుక్రవారం వర్ధంతి సందర్భంగా నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. సంపత్‌కుమార్, గౌస్, వెంకటేష్‌గౌడ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

నివాళి అర్పించిన మంత్రి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నివాళి అర్పించారు. జైపాల్‌రెడ్డి యువతకు మార్గదర్శి అన్నారు. కళాశాల చైర్మన్ రవికుమార్, వెంకటరామారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.